ఎరువుల దుకాణం వద్ద యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు

యూరియా చిటపటలు!

మాట్లాడుతున్న కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

హాజరైన జడ్‌పిటిసిలు, ప్రజాప్రతినిధులు

మాట్లాడుతున్న జడ్‌పి చైర్మన్ రామగోవిందరెడ్డి

ఉల్లిధరలపై ప్రశ్నిస్తున్న కమలాపురం జడ్‌పిటిసి సుమిత్రమ్మ

- ఉల్లి, చీనీ రైతులను ఆదుకోవాలి
- యూరియా కొరతపై ఆందోళన వద్దు : కలెక్టర్
- బోగస్ సర్టిఫికెట్లు ఇచ్చినవారిపై చర్యలేవీ? : జడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో యూరియా కొరతను అధిగమించడానికి గట్టిచర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సభ్యులు ముక్తకంఠంతో నినదించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ సభాభవనంలో జడ్‌పి చైర్మన్ ఎం.రామగోవిందరెడ్డి అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఇటీవల ఎన్నికైన పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసిలు మారెడ్డి లత, అద్దలూరు ముద్దుకృష్ణారెడ్డిచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జిల్లా వ్యవసాయశాఖ సమీక్షలో భాగంగా చక్రాయపేట, వేముల, వేంపల్లి, బి.మఠం, కాశినాయన జడ్‌పిటిసిలు యూరియా లభ్యతపై జిల్లా అధికారులు చెప్పే మాటలకు, క్షేత్రస్థాయిలో యూరియా కొరతకు పొంతన లేకుండా పోయిందని వాపోయారు. కమలాపురం జడ్‌పిటిసి లింగాల సుమిత్రమ్మ మాట్లాడుతూ జిల్లాలో ఉల్లిధరలు అదఃపాతాళానికి పడిపోయాయని, ప్రస్తుతం క్వింటాల్ ఐదు వందలు పలుకుతున్నాయని, ప్రభుత్వం క్వింటాల్ రూ.2 వేలు మద్దతు ధరను ప్రకటించాలని డిమాండ్ చేశారు. వీరపునాయునిపల్లి జడ్‌పిటిసి రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఉల్లి ధరల తరహాలో చీనీధరలు పడిపోయాయని, రూ.కిలో ఎనిమిది అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించిందని వాపోయారు. టన్నుకు రెండు న్నర టన్నులు సూట్ ఇవ్వాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి స్పందించి పులివెందుల అరటి మార్కెట్‌లో అటువంటి దుస్థితి లేదని, చిన్నచిన్న లోపాలుంటే సరిదిద్దుతామని చెప్పారు. రైల్వేకోడూరు జడ్‌పిటిసి స్పందించి అరటి రైతుకు ఇవ్వాల్సిన ప్రోత్సాహం ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. అన్నమయ్య జిల్లా హార్టీ కల్చర్ అధికారి స్పందించి అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించిన మామిడి రైతులకు పరిహారం జాబితా రూపకల్పన దశలో ఉందని వివరించారు. పింఛన్ల తొలగింపు అంశంపై ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి నిలదీశారు. కలెక్టర్ స్పందించి జిల్లాలో 2,223 మంది అనర్హులుగా తేలగా, వేరే కేటగిరీలోకి కొందరి అర్హులుగా ఉన్నారని వివరించారు. నోటీసులు అందుకున్న వారిలో 1189 మంది దరఖాస్తు చేసుకోలేదని, వీరిలో కొందరికి తెలిసో, తెలియకో ఉన్నట్లు ఉందని వివరించారు. అనంతరం వేంపల్లి ఎంపిపి రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ రూ.30 వేలు తీసుకుని వికలాంగ సర్టిఫికెట్లు ఇస్తుండడం ఓపెన్ సీక్రెట్ అని తెలిపారు. కలెక్టర్ స్పందించి దొంగ సర్టిఫికెట్లు ఇచ్చిన, పెట్టిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బోగస్ సర్టిఫికెట్లు ఇచ్చిన వారిపై చర్యలేవి అని జడ్‌పి రామగోవిందరెడ్డి చైర్మన్ ప్రశ్నించారు. జిల్లాలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తల్లికివందనం, అన్నదాత సుఖీభవ అందని పరిస్థితి ఏర్పడిందని పోరుమామిళ్ల జడ్‌పిటిసి ముత్యాల చెన్నయ్య సోదాహరణంగా వివరించారు. కలెక్టర్ స్పందించి రీసర్వే సమయంలో ఎల్‌పిఎం సమస్య కారణంగా ఇటువంటి పరిస్థితి నెలకొందని, త్వరలోనే సమస్యల్ని పరిష్కరిస్తామని తెలిపారు. బ్రహ్మంగారిమఠం ఎంపిపి వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ బి.మఠంలో 14 సచివాలయ భవనాలను ప్రారంభించినప్పటికీ కరెంటు సమస్య తీరడం లేదని వాపోయారు. ట్రాన్స్‌కో ఎస్‌ఇ స్పందించి తొమ్మిది సచివాలయాలకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చామని, మిగిలిన వాటికీ విద్యుత్ సదుపాయాన్ని కల్పిస్తామని తెలిపారు. బి.మఠంలో బస్‌షెల్టర్ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కమలాపురం నియోజకవర్గ పరిధిలోని చిన్నచెప్పలి, కీర్తిపల్లి, సంగమేశ్వరాలయ రోడ్డు, కొమ్మద్ది రహదారి గుంతలమయంగా మారిందని, తరుచుగా వాహన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని కమలాపురం జడ్‌పిటిసి ఎల్.సుమిత్రమ్మ ఆందోళన వ్యక్తం చేశారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి స్పందించి ఇరిగేషన్, ఆర్అండ్‌బి అధికారులను ఎప్పటిలోపు పూర్తి చేస్తారో చెప్పాలని నిలదీశారు. చెన్నూరు ఎంపిపి సురేష్ మాట్లాడుతూ సర్వీస్ రోడ్డు పనులు పూర్తి చేయాలని, తద్వారా బస్‌స్టేషన్ సదుపాయానికి అవకాశం ఉంటుందని వాపోయారు. అనంతరం వేంపల్లి ఎంపిపి రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్లు గుంతలమయంగా మారాయని, ఆక్రమణలపై ఆర్అండ్‌బి చోద్యం చూస్తోందన్నారు. ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గం పెద్దముడియం మండలం గుండ్లకుంటలోని జాతీయ రహదారిలోకి వరదనీరు ప్రవహిస్తోందని, కడప నగరరంలోని ఇక్బాల్ రైస్‌మిల్ దగ్గర నుంచి కిలోమీటరు మేరకు వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తోందని, సందుల, స్కూల్‌జోన్ సమీపంలో మార్కింగ్ సైతం చేయలేదని, ఫలితంగా ప్రమాదాల తీవ్రత పెరుగు తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం చక్రాయపేట జడ్‌పిటిసి మాట్లాడుతూ పాపాఘ్నిబ్రిడ్జి, అద్దాలమర్రి బ్రిడ్జి, కాలేటివాగు, గండి ఆంజనేయస్వామి ఆలయాల పనులు 80 శాతం మేరకు పూర్తయ్యాయని, మిగిలిన 20 శాతం పనులు పూర్తి చేయాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. డిసిసిబి చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో 249 ప్యాక్స్ ఉన్నాయని, వీటిలో 24 ప్యాక్స్‌కు సొంతభవనాలు ఉన్నాయని, మిగిలిన వాటికి ఆర్ఎస్‌కె భవనాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డిసిఎంఎస్ చైర్మన్ జయప్రకాష్ స్పందించి జిల్లాలోని డిసిఎంఎస్ కార్యాల యాలకు యూరియా బస్తాలను మంజూరు చేయాలని కోరారు. రూ.కోటితో స్కూల్ భవన సముదాయాన్ని నిర్మిస్తే బిల్లులు కావడం లేదని వాపోయారు. జిల్లా నాబార్డు అధికారి గురివిరెడ్డి లంచం ఇవ్వనిదే టోకెన్ కొట్టడం లేదని బి.మఠం ఎంపిపి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ఎమ్మెల్యేలు స్పందించి రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో నింపాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ స్పందించి కడప జిల్లాలో 83 టిఎంసిలను నిల్వ చేయడానికి అవకాశం ఉందని, 53 టిఎంసిలను నిల్వ చేశామని, ప్రాజెక్టుల సమీపంలోని చెరువులను వరుస క్రమంలో నింపుతున్నామని వివరించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, పి.రామసుబ్బారెడ్డి, జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఉమ్మడి జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన జడ్‌పిటిసిలు మారెడ్డి లత, ముద్దుకృష్ణారెడ్డి

యూరియా కావాలా..
ఇతర ఎరువులు కొనాల్సిందే!

దుకాణదారుల కొర్రీతో రైతుల ఆందోళన
యూరియా, డిఎపి విక్రయాల్లో దోపిడీ
బస్తాకు రూ.100-150 అదనపు వసూలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఎరువులు, దుకాణ యజమానుల షరతులతో యూరియా అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాధారణంగా వ్యవసాయం అధికంగా చేస్తుంటారు. అందులో వరిని అత్యధికంగా సాగు చేస్తుండగా, అందుకు తగ్గట్టుగానే రైతులు యూరియా, డిఎపి, కాంప్లెక్స్ వంటి ఎరువులను పంటలకు వినియోగిస్తుంటారు. దీనిని అదునుగా చేసుకొని కొంత మంది ఫర్టిలైజర్స్ దుకాణదారులు రైతుల అవసరాలను ఉపయోగించుకొని లాభాలను గడించడానికి ఒకటి కావాలంటే ఇంకొకటి అదనంగా కొనాల్సిందేనని షరతులు విధిస్తూ రైతులపై పెను భారాలను మోపుతున్నారు.

యూరియా, డిఎపి అమ్మకాల్లో వ్యాపారుల దందాకు అడ్డుకట్ట పడడం లేదు. రైతుల అవసరాలే ఆసరాగా కృత్రిక కొరత సృష్టిస్తూ నల్లబజార్లో అమ్మేస్తున్నారు. మండలంలో అధిక దుకాణాల్లో యూరియా, డిఎపి అడ్డుగోలుగా అమ్ముతున్నారు. రూ.266లకు అమ్మాల్సిన యూరియా బస్తా రూ.350-400కి అమ్ము తున్నారు. ఇతర ఎరువులు కొంటేనే యూరియా ఇస్తున్నారు. లేదంటే అదీ లేదు. మండల కేంద్రంలోని ఓ దుకాణానికి చెందిన యజమాని యూరియా కావాలన్న రైతులకు సుమారు రూ.1500ల విలువైన డిఎపి బస్తా లేదా రూ.800ల విలువైన సిఎన్ఎస్ కాంప్లెక్స్ బస్తా లేదా రూ.850ల విలువైన గడ్డి పిచికారి మందు (బకెట్) తప్పనిసరిగా కొనాలని షరతులు పెడుతున్నారు. లేదంటే యూరియా ఇవ్వకుండా వేధిస్తున్నారు. యూరియా బస్తా కూడా ఎమ్మార్పీ ధరలకు విక్రయించకుండా రూ.350ల నుంచి రూ.400ల వరకు రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని విక్రయిస్తున్నారు. రైతుల కొన్న ఎరువులకు కనీసం రసీదులు కూడా ఇవ్వడం లేదు.

అధిక ధరలపై రైతుల నిలదీత

మండల కేంద్రంలో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న దుకాణ యజమానిని రైతులు శనివారం నిలదీశారు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారిని మంజుల బాలాజీ ఫర్టిలైజర్స్ దుకాణంలో తనిఖీలు నిర్వహించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎరువులను విక్రయిస్తున్నట్లు కనుగొన్నారు. దుకాణంలోని సుమారు 8.4 మెట్రిక్ టన్నుల ఐదు రకాల ఎరువుల అమ్మకాలను నిలుపువేస్తూ స్టాకును సీజ్ చేశారు. దుకాణంలో ఉన్న సుమారు 9.5 టన్నుల యూరియాను ప్రజల అవసరాల నిమిత్తం వెంటనే విక్రయించాలని ఆదేశించారు. దుకాణదారుడికి షోకాజ్ నోటీసును ఎఒ మంజుల అందించారు. దీనిపై పూర్తి నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు, జిల్లా వ్యవసాయ అధికారికి పంపిస్తానని తెలిపారు. కాగా బాలాజీ ఫర్టిలైజర్స్‌లో స్టాక్ సీజ్ చేసి అమ్మకాలు నిలిపివేసి షోకాజ్ నోటీసులు జారీ చేసిన దుకాణ యజమానిలో మాత్రం ఎటువంటి మార్పు కనిపించడం లేదు. యథావిధిగానే రైతుల అవసరాలను ఆసరాగా అతను దోచుకుంటున్నారని రైతులు వాపోతున్నారు.

అదనంగా గడ్డి పిచికారి మందు కొన్నా

యూరియా బస్తా కావాలని నిమ్మనపల్లికి వచ్చాను. యూరియా ఎక్కడ లేకపోవడంతో నిమ్మనపల్లిలోని బాలాజీ ఫర్టిలైజర్స్ వద్ద రూ.350లకు యూరియా బస్తా ఒకటి కొన్నాను. యూరియా బస్తా కోసం అదనంగా రూ.850లు పెట్టి గడ్డి పిచ్చికారి మందు (బకెట్)ను కొనాల్సివచ్చింది.

- ఎ.ఆదినారాయణ, రైతు, చల్లావారిపల్లి.

యూరియాతో ఇబ్బందిగా ఉంది

అవసరమైన యూరియా దొరకక ఇబ్బందులు పడుతున్నాం. నిమ్మనపల్లిలోని ప్రయివేటు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో రైతులకు ఏది కావాలంటే అది మాత్రమే అమ్ముతున్నారు. బాలాజీ ఫర్టిలైజర్స్‌లో యూరియా కావాలంటే, అదనంగా ఏదో ఒక ఎరువును కొనాలంటున్నారు. రెండు బస్తాల యూరియా కొన్నాను. అందుకు అదనంగా రెండు బస్తాల సిఎన్ఎస్ కాంప్లెక్స్ రూ.1600లు పెట్టి కొనాల్సి వచ్చింది. ఇలా యూరియాను కొనాలంటే రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

- ఈశ్వరయ్య, రైతు.

ఎరువులు సీజ్ చేశాం

బాలాజీ ఫర్టిలైజర్స్‌లో ఎరువుల అమ్మకాలలో షరతులను విధిస్తున్నారని రైతుల నుంచి తమకు ఫిర్యాదులు అందాయి. తనిఖీలు నిర్వహించగా రైతుల ఫిర్యాదులు నిజమని తేలింది. యూరియా కొనాలంటే అదనంగా ఏదో ఒక ఎరువును కొనాలని దుకాణం యజమాని బాలకృష్ణ షరతు విధించిన విషయం నిజమని తేలింది. దీనిపై అతనికి షోకాజ్ నోటీసు జారీ చేశాం. ప్రస్తుతం దుకాణంలో నిల్వ ఉన్న 8.4 మెట్రిక్ టన్నుల ఐదు రకాల ఎరువులను సీజ్ చేసి అమ్మకాలను నిషేధించాం. ఎక్కడైనా ఎరువులను ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలకు విక్రయించినా, షరతులతో అమ్మకాలు జరిపిన్నా, కొన్న వాటికి రసీదులు ఇవ్వకపోయినా రైతులు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలి. అటువంటి వాటిపై చట్టపకారం చర్యలు తీసుకుంటాం.

- మంజుల, మండల వ్యవసాయ అధికారి, నిమ్మనపల్లె.

లాటరీ ద్వారా మద్యం దుకాణాలు కేటాయింపు : కలెక్టర్

మద్యం దుకాణాల లాటరీ డ్రా తీస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం నూతనంగా జిల్లా వ్యాప్తంగా 11 ఓపెన్ బార్లకు, ఒక రిజర్వ్‌డ్ బార్‌కు లాటరీ ద్వారా కేటాయింపు నిర్వహించినట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో బార్ల కేటాయింపు లాటరీ డ్రా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మదనపల్లి డివిజన్‌లో మూడు బార్లు, రాయచోటిలో రెండు బార్లు, రాజంపేటలో రెండు బార్లు, కల్లుగీత కార్మికులకు ఒక రిజర్వ్‌డ్ బార్ సహా మొత్తం 11 ఓపెన్ బార్లకు, ఒక రిజర్వ్‌డ్ బార్‌కు లాటరీ ద్వారా కేటాయించామని వివరించారు. మదనపల్లిలో అంగజాల రాజన్న, బి. మనోహర్, బండారు నాగరాజులు, రాయచోటిలో దొండ్ల హర్ష వర్ధన్, పేరం ఇరగంరెడ్డి, రాజంపేటలో కె. సురేష్‌కుమార్ నాయుడు, కె. సుబ్బయ్యల, అలాగే కల్లుగీత కార్మికులకు రిజర్వ్‌డ్ బార్ కేటాయింపులో బి. కొత్తకోట బార్‌ను కుడుము ఆదిత్యకు లాటరీ డ్రా ద్వారా కేటాయించామని కలెక్టర్ వివరించారు. మిగిలిన నాలుగు బార్లకు తగినన్ని దరఖాస్తులు రాకపోవడంతో లాటరీ నిర్వహించలేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జి.మధుసూదన్, ఎఇ జోగేంద్ర, సిఐలు ఎల్లయ్య, గురుప్రసాద్, భీమలింగ, సుబ్బారెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఎల్‌డిఎంతో పాటు దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంగా రాయచోటినే కొనసాగించాలి

ప్రజాశక్తి - రాయచోటి : రాయచోటిని జిల్లా కేంద్రంగానే కొన సాగించాలని అఖిలపక్ష కమిటీ నాయకులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాయచోటిని జిల్లా కేంద్రంగానే ఉంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం అఖిల పక్ష నాయకుల సమావేశం ఉంటుందని ప్రజాసంఘాల నాయకులు, న్యాయవాదులు, అన్ని రాజకీయ పార్టీలు, కుల, బిసి సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేయాలన్నారు. సమావేశంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ఈశ్వర్, ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు, ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్బవర హరిబాబు, భారతీయ అంబేద్కర్ సేన పల్లం తాతయ్య, రజక సంఘం నాయకులు టి.రమేష్, వీరబల్లి శ్రీనివాసులు, మండల లీగల్ సర్వీస్ కమిటీ మాజీ సభ్యుడు విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

అండర్-23 క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం

ప్రజాశక్తి - కడప: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలో వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియం, కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానాలలో ఎసిఎ సౌత్ జోన్ అండర్- 23 మల్టీ డే క్రికెట్ మ్యాచ్‌లు శనివారం ప్రారంభమయ్యాయి. కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు, కడప జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90.0 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 346 పరుగుల భారీ స్కోరు దిశగా పయనిస్తుంది. ఆ జట్టులోని జెనిక్ దాస్ బ్యాటింగ్ అద్భుతంగా ప్రదర్శించి 109 పరుగులు (సెంచరీ) చేశాడు. రెడ్డి రుషిల్ 84, తేజా రెడ్డి 60 (నాటౌట్), వెంకటేష్ 54 పరుగులు చేశారు. కడప జట్టులోని ఎస్ఎమ్‌డి అస్లాం రెండు వికెట్లు తీసుకున్నాడు.

వైఎస్.రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నెల్లూరు, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 82.0 ఓవర్లను 6 వికెట్ల నష్టానికి 374 పరుగుల భారీ స్కూల్ సాధించింది. ఆ జట్టులోని సోహన్ వర్మ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి 166 పరుగులు (సెంచరీ) చేసి నాటౌట్ గా నిలిచాడు. పవన్ రిత్విక్ 79, మాధవ్ 43 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని అక్షిత్ రెడ్డి 2, సాయి ప్రణవ్ చంద్ర 2 వికెట్లు తీసుకున్నారు.

నేడు నెలనెలా సీమ సాహిత్యం

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సిపిబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 146వ సదస్సు ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 146వ సదస్సులో 'శుభ్రజ్యోత్స(యెద్దల గంగయ్య) జీవితం-సాహిత్యం' అనే అంశంపై నాగిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లె వెంకటరమణ ప్రసంగిస్తారని తెలిపారు.

ప్రజలకు సేవ చేయడమే నిజమైన రాజకీయం : 'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు

రాజకీయం చేయడం అంటే పెత్తనం చలాయించడం కాదని, ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజలు కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం వినియోగించాలని, ప్రజలకు సేవ చేయడమే నిజమైన రాజకీయమని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం పీలేరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో నిర్వహించిన స్త్రీశక్తి విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ కావడంతో దేశంలోనే సాహస పథకాల సంక్షేమ సారధిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలిచారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాల్లో ఎన్టీఆర్ భరోసా, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, రైతులకు అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి ఐదు రకాల పథకాలు అమలు చేసి రాష్ట్రంలో సంచలనం సృష్టించారని పేర్కొన్నారు. స్త్రీ శక్తి పథకంతో వివిధ రకాల ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రంలో మహిళలు ఎక్కడికైనా ప్రయాణం చేసే వెసులుబాటు కల్పించి మహిళలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని చెప్పారు. పి4 సర్వేతో పేదరికం లేని సమాజంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే పేదలను గుర్తించి వారిని దత్తకు తీసుకునే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకెళుతున్నారన్నారు. గత వైసిపి పాలనలో భూ ఆక్రమణలు, ఇసుక అక్రమ రవాణా, నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాట మాడి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో హంద్రీ-నీవా కాలువల ద్వారా వ్యవసాయానికి సాగునీరు అందించడం, పెట్టుబడులు తెప్పించడం, రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణం, రాష్ట్రం నలుమూలల వివిధ సంక్షేమ పథకాలతో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే స్వయంగా మహిళలకు వారు కూర్చున్న చోటికి వెళ్లి అందరికి అభివాదం చేస్తూ కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ప్రవీణ్‌కుమార్

బాల్య వివాహాలకు స్వస్తి పలకాలి : జడ్జి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సంపూర్ణ పరిజ్ఞానంతో బాల్య వివాహాలకు పూర్తిగా స్వస్తి పలకాలని మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.ప్రవీణ్ కుమార్ తెలిపారు. బాల్యవివాహాల నిర్మూలన, తక్కువ వయసులో గర్భం దాల్చడం వలన వచ్చే నష్టాల పట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మూడవ అదనపు జిల్లా జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధిత చట్టం గురించి పలు ఉదాహరణలతో విద్యార్థులకు వివరించారు. బాల్య వివాహం చేసిన వారికి, వారి తల్లిదండ్రులకు, వివాహ కార్యక్రమంలో పాల్గొనే వ్యక్తులందరూ శిక్షార్హులని తెలిపారు. చిన్న వయసులో వివాహం చేసుకొని అనారోగ్య సమస్యల బారిన పడకూడదని సూచించారు. పిల్లల మీద లైంగిక దాడులకు పాల్పడిన వారికి పోస్కో చట్టం ప్రకారం జీవిత ఖైదు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రేమ మోజులో పడి బాలికలు అక్రమ రవాణా బారిన పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. గృహహింస చట్టంపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి 18 సంవత్సరాలు వయసు నిండిన తర్వాత లైసెన్స్ పొంది బీమా కలిగిన వాహనాలను మాత్రమే నడపాలని తెలిపారు. గైనకాలజిస్ట్ డాక్టర్ మెహతాజ్ బేగం మాట్లాడుతూ యుక్త వయసులో గర్భం దాల్చడం వలన వచ్చే సమస్యల గురించి వివరించారు. ప్యానెల్ న్యాయవాది పి.ఎన్.శ్రీనివాసులు మాట్లాడుతూ న్యాయ సేవల యొక్క సహాయం మరియు విధులు గురించి వివరించారు. కార్యక్రమంలో సిడిపిఒ సునంద, బార్ అసోసియేషన్ అధ్యక్షులు హనుమంతు నాయుడు, న్యాయవాది శోభారాణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమణరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనకు పటిష్ట భద్రత : ఎస్‌పి

మాట్లాడుతున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనకు సంబంధించి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. శనివారం ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించడానికి సుమారు 600 మంది పోలీసు సిబ్బందితో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. భద్రతా ఏర్పాట్లు ముఖ్యమంత్రి పర్యటన సాఫీగా, సురక్షితంగా జరిగేలా దోహదపడతాయన్నారు. భద్రతా చర్యల నేపథ్యంలో ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాజంపేట ఎఎస్‌పి మనోజ్ రామనాథ్ హెగ్డే, అర్బన్, రూరల్ సిఐలు పాల్గొన్నారు.

సిఎం పర్యటనను విజయవంతం చేద్దాం

- టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి ఒక క్రమశిక్షణ గల పార్టీ అని, కార్యకర్తలందరూ సమన్వయంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజంపేట పర్యటనను విజయవంతం చేద్దామని రాజంపేట తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి, పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు కార్యకర్తలకు సూచించారు. శనివారం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ఆరు మండలాల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు ఏకగ్రీవ తీర్మానం చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియజేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆరు మండలాల టిడిపి అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

కెజిబివి కళాశాల సమీపంలో మట్టిని తవ్వుతున్న జెసిబి

అక్రమంగా మట్టి తరలింపు

- పట్టని అధికారులు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడు పట్టణంలో గృహం నిర్మించుకోవాలన్నా, తక్కువగా ఉన్న భూమి ఎత్తు చేసుకోవాలన్నా, పునాదులను నింపుకోవాలన్న ఎర్రమట్టి, గరపమట్టి, ఇసుకను వాడుతూ ఉంటారు. జెసిబిని బాడుగకు తీసుకోవడం, కొన్ని ట్రాక్టర్లు తీసుకోవడం ఏకంగా కొండలు, గుట్టలపైనే దృష్టి అక్రమంగా మట్టిని తవ్వుకొని సొమ్ము చేసుకుంటున్నారు. కొండను తవ్వి మట్టిని తరలించుకొని పోతున్న జెసిబి యజమానులు, ట్రాక్టర్ల యజమానులపై చర్యలు తీసుకుంటే మరొకసారి అక్రమాలకు పాల్పడ కుండా ఉంటారని ప్రజలు చర్చించుకుంటున్నారు. సెలవు రోజుల్లో ఏకంగా చెరువులు, కుంటలు, గుట్టలు, కాలువలు ఏమి వదలకుండా జెసిబి యంత్రాన్ని ఉపయోగించి టాక్టర్లలో మట్టిని అక్రమ రవాణా చేస్తున్నారని అంటున్నారు. పంచాయ తీకిగానీ, రెవెన్యూ అధికా రులకు ఎటువంటి పన్నులు చెల్లించకుండా యథేచ్ఛగా మట్టిని తరలించుకొని పోతున్నా అధికారులు పట్టి పట్టన్నట్లు వ్యవ హ రిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎటువంటి పన్నులు చెల్లించకుండా అక్రమంగా మట్టిని తరలించుకొని పోతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాము కాటుతో యువతికి అస్వస్థత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పాము కాటుతో యువతి తీవ్ర అస్వస్థతకు గురైంది. రామ సముద్రం మండలం, చెంబకూరుకు చెందిన టి.బాబు కుమార్తె అంజుమ్ ఇంటికి సమీపంలోని పొలం వద్ద ఉన్న పాడి ఆవులకు మేత వేసేందుకు శని వారం ఉదయం వెళ్ళింది. గడ్డివామి నుంచి మేతను తీస్తుండగా గడ్డివామి మధ్యలో దాక్కొని ఉన్న పాము ఒక్కసారిగా యువతి కాలిపై కాటు వేసింది. తీవ్ర అస్వస్థతకు గురైన బాధితురాలిని కుటుంబీకులు చికిత్స కోసం వెంటనే మదన పల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి మహేష్

బాల్య వివాహాలను అరికట్టాలి

-11వ అదనపు జిల్లా జడ్జి మహేష్

ప్రజాశక్తి-పీలేరు

బాల్య వివాహాలను అరికట్టాలని 11వ అదనపు జిల్లా జడ్జి మహేష్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మరిమాకులపల్లి తాండాలో బాల్యవివాహాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల్లో వైవాహిక వయస్సు రాకుండానే బాల్య వివాహాలు చేసుకుంటున్నారని తెలిపారు. ఎవరు కూడా చదువుకునే వయస్సులో వివాహాలు చేసుకోవద్దని సూచించారు. శారీరక ఎదుగుదల కానిదే వివాహాలు చేయడం వల్ల పుట్టబోయే పిల్లలు మానసిక ఎదుగుదల లేకుండా, పూర్తిగా అనారోగ్యంతో ఉంటారని చెప్పారు. వారి కుటుంబంలో, వైవాహిక జీవితంలో అన్యోన్యత ఉండదని, సంసారం బాధలను తట్టుకునే శక్తి వారి కుండదని తెలిపారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, చదువుకునే వయసులో చదువుకోవాలని, భవిష్యత్తు మంచి ప్రయోజకులుగా ఉండాలనిన్నారు. అంగీకారంతో పెళ్లి చేసుకోవాలని, తెలిసి తెలియని వయసులో ప్రేమలో పెళ్ళిళ్లని యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని సూచించారు. బాల్య వివాహాలపై అవగాహన లేని వారు గ్రామాల్లో చాలామంది ఉన్నారని, వారికి బాల్య వివాహాలపై వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ వారు, వైద్య శాఖ, గిరిజన సంక్షేమశాఖ వారు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని అప్పుడే గ్రామాలలో బాల్య వివాహాలు అరికట్టవచ్చని తెలిపారు. ప్రభుత్వం ద్వారా అనేక కార్యక్రమాలు పిల్లలకి చేయూతనందిస్తున్నారని వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో స్పెషల్ మెజిస్ట్రేట్ జడ్జి ఆర్ మురళి, డిటి, తలుపుల పిహెచ్‌సి డాక్టర్ ఎం.చంద్రశేఖర్ నాయక్, ఎంఇఒ పద్మావతి, ఎంపిడిఒ, శ్రీనివాసు, ఆర్‌టిసి బాబు నాయక్, న్యాయవాది షౌకతలి, సిడిపిఒ రాజమ్మ, తపాలాశాఖ జనార్ధన, పీలేరు అర్బన్ ఎస్‌ఐ, అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్, ఎఎన్ఎంలు,ప్రజలు పాల్గొన్నారు.

అధ్యాపకులు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - చక్రాయపేట

అధ్యాపకులు సమయపాలన పాటించాలని డివిఇఒ వెంకటేశ్వర్లు సూచించారు. చక్రాయపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపల్ షేక్ రంతుబాషా ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 2026 ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలన్నారు. ఆ మేరకు డివిఇఒ అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులందరూ కష్టపడి చదివి పరీక్ష లలో మంచి ఫలితాలను సాధించాలని, గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఆయన విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సహకరించాలి

వేంపల్లె : ట్రాఫిక్ నిబం ధనలను పాటించి, రోడ్డు ప్రమాదాల నియం త్రణకు సహకరించాలని సిఐ నర్సింహులు కోరారు. స్థానిక కడప-పులి వెందుల, రాయచోటి బైపాస్ రోడ్డులో శనివారం ఆయన ఆటోల్లో ప్రయా ణిస్తున్న కూలీలు, మోటర్ బైకులో వెళుతున్న వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అధికలోడ్‌తో ఆటోలో వెళితే ప్రమాదాలు సంభవిస్తే కుటుంబాలు ఇబ్బందులు పడతాయని వివరించారు. అధిక లోడుతో వెళ్లే ఆటోలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మైనర్లుకు వాహనాలు ఇస్తే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగేఅవకాశం ఉందన్నారు. మోటర్ బైకులు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పక ధరించాలని కోరారు. రికార్డులు లేని వాహనదారులకు ఎస్ఐ జరిమానా విధించారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి

పజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జడ్జి డాక్టర్ బాబా ఫక్రుద్దీన్ సూచించారు. కమ లాపురం, జమ్మలమ డుగు, ప్రొద్దుటూరు సబ్ జైళ్లను శనివారం ఆయన పరి శీలించారు. ఈ సందర్భంగా జడ్జి సబ్ జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను వివ రించారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహా యం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంను వివరించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసు కున్నారు. జైళ్లలో బాల నేరస్తులు ఉంటే గుర్తించడం, వారికి తగు న్యాయ సహాయం అందించడం వంటి అంశాలను వివరించారు. జైలు పరిసరాలు, టాయిలెట్లు, వంట గది, వసతి గదులను పరిశీలించి తగు సూచనలు చేశారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై ప్రచారం చేశారు. కార్యక్రమంలో కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు సబ్ జైళ్ల సూపరింటెండెంట్స్, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్స్, ప్యానల్ న్యాయవాదులు, ఖైదీలు పాల్గొన్నారు.

దళితుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ, పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సిరాజుద్దీన్, ఎంపిడిఒ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు అన్నారు. శని వారం సామకోటవారిపల్లె పంచాయతీ పరిధిలోని ఎర్రంవారిపల్లెలోపౌర హక్కుల దినోత్సవం సమావేశాన్ని మండల అధికారులతో, దళిత సంఘాల నాయకులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ, పౌరహక్కుల పై ప్రతి ఒక్కరూ కనీస అవ గాహన కలిగి ఉండాలని అన్నారు. మండలంలో ప్రతినెలా 30వ తేదీన దళిత వాడల్లో సివిల్ రైట్స్ డే సమావేశాన్ని నిర్వహిస్తూ ప్రజల సమస్యలను క్షేత్రసాయిలో తెలుసుకొని పరిష్కరిస్తూ వస్తున్నామని అన్నారు. దళిత వాడల్లో అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు, ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడానికి, వారి సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతను కల్పిస్తున్నాదని అన్నారు. సమావేశంలో వచ్చే ప్రతి అర్జీని స్వీకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార మార్గం చూపుతున్నామన్నారు. మురుగునీటి కాలువలను, విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారన్నారు. మురుగనీటి కాలువను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఎంపిడిఒ ఆదేశించారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సివిల్ రైట్స్ డే సమావేశంలో అధికారుల దృష్టికి తెచ్చిన సమస్యలను ఇప్పటివరకు పరిష్కరించలేదని అన్నారు. సివిల్ రైట్స్ డే సమావేశానికి కొంతమంది అధికారులు మాత్రమే, మిగిలిన శాఖల అధికారులు హాజరు కాకపోతే సమస్యలు ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. వచ్చే నెల 30వ తేదీన

సివిల్ రైట్స్ డే సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

నిర్వహించే సివిల్ రైస్ డే సమావేశానికి ప్రతి శాఖకు సంబంధించిన మండల అధికారి తప్పనిసరిగా హాజరు కావాలని, లేకుంటే సమావేశాన్ని బహిష్కరించి, అధికారుల తీరును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. దళితుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న మండల అధికారులకు దళిత సంఘాల నాయకులు మునిరత్నం, డవ్ నాగరాజా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్లికార్జున, మహేష్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, అధికారులు ఎంఇఒ నారాయణ, ఎపిఒ రమేష్, ఎపిఎం మురళి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ మిథున్ చక్రవర్తి, హౌసింగ్ ఎఇ అమర్నాథ్, మండల సర్వేయర్ గోపీనాథ్, విఆర్ఒ సుధాకర, పోలీస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి నౌరిన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా వినాయకుడి నిమజ్జనం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పట్టణంలోని పోకనాటివీధి శ్రీకో దండ రామస్వామి దేవ స్థానం దగ్గర ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి నాలుగు రోజులుపాటు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. పోకనాటి వీధి వినా యక కమిటీ, ధర్మకర్తలు ఆధ్వర్యంలో ఉభ యదా రుల సహకారంతో ప్రతి రోజూ విశేష అన్న దాన కార్యక్రమం నిర్వహిం చారు.నిత్య పూజ లందుకున్న గణపయ్యను కళాకా రులతో ప్రత్యేక మేళ తాళాలు, బళ్లారి డ్రమ్స్, భజనలు నడుమ కోలాహలంగా వినాయకుడు విగ్రహాన్ని నిమజ్జనానికి సాగనంపారు. ప్రత్యేక పూజలు చేసి,పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో, కళాకారులతో మేళతా ళాలతో బాణాసంచా పేలుస్తూ నిమజ్జన కార్యక్రమం కన్నుల పండు గలా నిర్వహించారు. గణపతికి సమర్పించిన లడ్డూను వేలంపాట ఆసక్తికరంగా సాగింది.డి.వినోద్‌కుమార్‌రెడ్డి రూ.35,300లు హెచ్చుపాట పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో అన్నదాన కార్యక్రమ దాత గీతాల శేష శైలందర్‌నాథ్‌రెడ్డి, కంచి లోకేష్‌రెడ్డి, మారెడ్డి సతీష్‌రెడ్డి, కంచి కోదండ, వి.విరెడ్డి, కళ్యాణ్‌కుమార్‌రెడ్డి, వంక దశరథరామ్‌రెడ్డి, రాయి నారాయణరెడ్డి, ఎర్రగుంట్ల మోహన్ రెడ్డి, గుంతూరు రామాంజి రెడ్డి, గడ్డం సందీప్ రెడ్డి, మారెడ్డి లోహిత్ రెడ్డి, ఎర్రగుంట్ల వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిస్తున్న వినాయక విగ్రహం

రూ.50వేలు పలికిన గణేశుడి లడ్డూ

నందలూరు : మండలంలోని టివిపురం గ్రామంలో వైసిపి బిసి విభాగం రాజంపేట నియోజకవర్గ అధ్యక్షులు భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద కేజీల లడ్డూ వేలంపాటలో రూ.50వేలు గోగుల శ్రీనివాసులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో వై.వెంకటసుబ్బయ్య, నారాయణ, భాస్కర్‌రాజు, మల్లికార్జునరాజు, ఎం.శివ, చందు,సుబ్బు, వాసు, సుబ్బరాయుడు,కళ్యాణ్ పాల్గొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు

మండలంలోని నాగిరెడ్డిపల్లిలోని జూనియర్ సివిల్ కోర్టు వద్ద ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 32వ వార్షికో త్సవం సందర్భంగా వినాయకుని విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన రంగవల్లుల పోటీలు అలరించాయి. ఈ పోటీలలో కవిత ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని ప్రెజర్‌కుక్కర్‌ని, ఎంబలూరు కళ్యాణి ద్వితీయ స్థానంలో నిలిచి హాట్‌బాక్స్, నారాయణమ్మ తృతీయ స్థానంతో వాటర్ ప్యూరిఫైడ్‌ను కైవసం చేసుకున్నారు. పోటీలలో పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. న్యాయ నిర్ణయితలుగా డాక్టర్ శ్రీవాణి, వైసిపి మహిళా మండల అధ్యక్షురాలు పల్లె మాధవి వ్యవహరించారు. ఆకేపాటి జగదీశ్వర్‌రెడ్డి, వల్లంకొండు శివకుమార్, వెంకట కుమార్, గీత, కృష్ణ, నారాయణ, గండికోట శివకుమార్, మురళి, నారాయణశెట్టి, సుమ, జ్యోతి, లక్ష్మి పాల్గొన్నారు.

లడ్డూకు ఊహించని ధర

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మండలంలోని ఓ మారుమూల ప్రాంతంలో గణేషుని లడ్డూకి ఊహించని ధర లభించింది. ఎన్నడూ లేనంతగా భక్తులు లడ్డూ వేలంలో పోటీ పడడంతో రూ.1.65 లక్షల ధర పలికింది. మలేపాడు పంచాయతీలో దొనబైలు ఒక మారు మూల ప్రాంతం. వినాయక చవితి పండుగను పుర స్కరించుకుని గ్రామస్తులు వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించుకుని, ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. గణేషుని నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన గణేశుని లడ్డూ వేలం పాటకు ఊహించని రీతిలో పోటీ పెరిగింది. ఈ పోటీలో గ్రామానికి చెందిన ముడి శివశంకర్ రూ.1.65 లక్షలకు లడ్డూను దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా దొనబైలు గ్రామప్రజలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూట్యూబర్ భూషణ్, జ్యోతి, టిడిపి బిసి జనరల్ సెక్రెటరీ రెడ్డిశేఖర్‌నాయుడు, కాశిశ్రీరామ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వేలంపాటలో లడ్డూను దక్కించుకున్న ముడి శివశంకర్

చెరువులకు నీరందేదెప్పుడు ? : 'నిస్సార్'

బాబుష్యూరిటీ-మోసం గ్యారంటీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

శ్రీశైలం నుండి కుప్పం వరకు నీరు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటూ జలహారతులు ఇవ్వడం కాదు, ఎన్ని చెరువులకు నీరందించారో చెప్పాలని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ డిమాండ్ చేశారు. సాగు, తాగు నీటి అవసరాల కోసం చేపట్టిన హంద్రీ-నీవా కాలువ నిర్మాణానికి ఆద్యుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని చిప్పిలిలో చేపట్టిన బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమంలో పేర్కొన్నారు. మండలంలోని చిప్పిలి, మదనపల్లె మున్సిపాలిటీ 8, 9 వార్డులలో నిస్సార్ అహమ్మద్ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మనుజా రెడ్డి, ఎపి ఎండిసి మాజీ చైర్ పర్సన్ షమీమ్ అస్లాం, కౌన్సిలర్లు ఇర్ఫాన్ ఖాన్, చంద్రశేఖర్, ఆంజనేయులు, ఈశ్వర్ నాయక్, మునిశేఖర్, వి.ఎస్.రెడ్డి, చరణ్, రఘునాథ్‌రెడ్డి, శారదా రెడ్డి, వినీతాబాయి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సిఎం అయిన తరువాత ప్రజలను ఏవిధంగా మోసం చేస్తున్నారో ప్రజలకు వివరించారు. హంద్రీనీవా జలాలు కుప్పం వరకు వెళ్తున్నాయని సంబరాలు తప్ప రైతులకు, ప్రజలకు ఒరిగింది ఏమి లేదని విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా మదనపల్లె నియోజకవర్గంలో చెరువులకు నీరు అందించిన దాఖలు లేవన్నారు. చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేసి నీరు నిల్వ ఉంచితే పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడమే కాకుండా చూట్టూ ఉన్న రైతుల బోర్లులో నీరు సంవృద్ధిగా వుంటుందని, తద్వారా పంటలు పండుతాయని వివరించారు. ప్రధానంగా బాహుదా ప్రాజెక్టు, సిటిఎం పెద్ద చెరువు, చిప్పిలి, గుట్టకిందపల్లి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. పేరుకు మాత్రమే హంద్రీ-నీవా కాలువ ద్వారా నీరు వస్తోందని చెప్పడం తప్ప ప్రజానీకానికి ఏమాత్రం ఉపయోగ పడటం లేదన్నారు. తక్షణం చెరువులకు నీరు అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. హంద్రీ-నీవా కాలువ నీటి సామర్థ్యం పెంచి ప్రాజెక్టులు, చెరువులకు నీరు అందించినప్పడే ప్రయోజనం చేకూరుతుందన్నారు.

సింగులారిటీ ఇండియా సమ్మిట్-25లో 'మిట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె

అంగళ్లు సమీపంలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీకి చెందిన అధ్యాపకులు, బిటెక్, ఎంబిఎ, ఎంసిఎ విభాగాలకు చెందిన 120మంది విద్యార్థులు బెంగళూరులోని రాజాజీనగర్, బ్రిగేడ్ గేట్‌వేలోని శరతన్ గ్రాండ్ హోటల్‌లో రెండు రోజులపాటు జరిగిన అంతర్జాతీయ సింగులారిటీ ఇండియా సమ్మిట్-2025లో పాల్గొన్నారని యూనివర్సిటీ విసి డాక్టర్ సి.యువ రాజ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దార్శనికులు, పరిశోధకులు, పరిశ్రమ నాయకులు, వ్యవస్థాపకులు, విధాన రూపకర్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ముఖ్యమైన సమావేశంగా ఈ సమ్మిట్ నిలిచిందని తెలిపారు. ఈ శిఖరాగ్ర సమావేశం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీ, క్వాంటం కంప్యూటింగ్, పునరుత్పాదక శక్తి, స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాల్లో జరుగుతున్న నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించిందని పేర్కొన్నారు. ప్రపంచ సాంకేతిక దృశ్యాన్ని రూపొందించడంలో భారతదేశం కీలక పాత్ర పోషిస్తోందని కూడా తెలిపారు. స్థిరమైన ఆవిష్కరణ, డిజిటల్ పరివర్తన, సమ్మిళిత వృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికి విద్యాసంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వాల మధ్య సహకారాన్ని పెంపొందించడం ఈ సమ్మిట్ ప్రధాన లక్ష్యమని వివరించారు. ఇందులో కీలక ప్రసంగాలు, నిపుణుల ప్యానెల్ చర్చలు, పరిశోధన ప్రదర్శనలు, నెట్‌వర్కింగ్ అవకాశాలు లభించాయని, ఇవి విద్యార్థులకు అభివృద్ధి చెందుతున్న ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థ, భవిష్యత్ సాంకేతికతలు, కెరీర్ అవకాశాలపై లోతైన అవగాహన కలిగించాయని తెలిపారు. ప్రతిష్ఠాత్మకమైన ఈ అంతర్జాతీయ వేదికలో మిట్స్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొనడం ద్వారా, యువ సాంకేతిక నిపుణులను వినూత్న ఆలోచనలు, భవిష్యత్ అవకాశాలకు పరిచయం చేయడంలో యూనివర్సిటీ కట్టుబాటును ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు.

అంతర్జాతీయ సింగులారిటీ ఇండియా సమ్మిట్-2025కు హాజరైన విద్యార్థులు

మంచి ప్రభుత్వానికి అండగా ఉండాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మన మంచి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి కోరారు. స్త్రీశక్తి పథకం సూపర్‌హిట్ కార్యక్రమంలో భాగంగా శనివారం పాత బస్టాండ్‌లోని గాంధీ సర్కిల్ వద్ద నుంచి నారాపురస్వామి దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నియోజకవర్గంలోని మహిళా కార్యకర్తలు, మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చెప్పిన ప్రతి హామీని అమలు చేసిందన్నారు. త్వరలోనే ఆడబిడ్డ సంక్షేమ పథకం కూడా అమలు చేస్తామన్నారు. అంతకుముందు కొందరు మహిళలు జమ్మలమడుగు పట్టణంలో దోమలు విలయతాండవం చేస్తున్నాయని, పింఛన్ రాలేదని, కొండాపురం మండలంలో కుట్టు మిషన్ శిక్షణ పొందుతున్న వారికి ఉపాధి కల్పించాలని వంటి పలు సమస్యలను భూపేష్ సుబ్బరామిరెడ్డి దృష్టికి తెచ్చారు. స్పందించిన భూపేష్ సుబ్బరామిరెడ్డి సమస్యను అర్జీ రూపంలో అందిస్తే తాను వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో స్వయంగా ఆయనే మహిళలకు వడ్డించారు. కార్యక్రమంలో భూపేష్‌రెడ్డి తండ్రి మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, పెంచలమ్మ పాల్గొన్నారు.

భోజనాన్ని వడ్డిస్తున్న ప్రసాద్‌బాబు

అన్న దానం గొప్పది : 'సుగవాసి'

ప్రజాశక్తి-రాయచోటి

అన్నదానం గొప్పదని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టిటిడి పాలక మండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు.శనివారం మధ్యాహ్నం పట్టణం మదనపల్లి రోడ్డు అజయ్ రెసిడెన్సీ వెనుక సుంకర రవి (లవరాజు), కె.రామా పురం ఆరిండ్ల వీధిలో కొమ్మెరవాది సతీష్, మాణికుమార్, ఎగు అబ్బవరంలో అబ్బవరం నారాయణ కుమారుడు ఆర్ఎంపి డాక్టర్ రెడ్డయ్య ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజర య్యారు.ఈ సందర్భముగా ప్రసాద్ బాబు మాట్లాడుతు వినాయకుని విగ్రహం దగ్గర అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనియమని అన్నారు. ప్రతి ఒక్కరూ సమాజానికి ఉపయోగపడే మంచి పనులు చేయాలని సూచిం చారు. కార్యక్రమంలో మాజీ డీలర్ శ్రీను, టిడిపి నాయకులు చిన్నబ్బి, నాగేశ్వర రావు, విజయ్, రెడ్డయ్య, మహేష్, రాయచోటి హరి, రామాంజనేయులు పాల్గొన్నారు.

బస్సు కోసం వేచివున్న విద్యార్థులు

బస్సు కోసం విద్యార్థుల పడిగాపులు

- బస్సు నిలపాలని వేడుకోలు

ప్రజాశక్తి-గాలివీడు

విద్యార్థులను బస్సు ఎక్కించుకోనిపోవడంలో ఆర్‌టిసి సిబ్బంది అలసత్వం వహిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం గాలివీడులోని బాలికల ఉన్నత పాఠశాలలో చుట్టూ పక్కల గ్రామాల నుంచి బాలికలు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. పాఠశాల వదలిన వెంటనే విద్యార్థులు రోడ్డుపై వచ్చి బస్సు కోసం వేచి ఉన్నా కూడా కదిరి-రాయచోటి మార్గం వెళ్లే బస్సులు ఆపకుండా వెళుతున్నాయని చెప్పారు. విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకోలేకపోతున్నారని అన్నారు. పాఠశాల వదలిన వెంటనే ఇంటికి చేరుకునేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆర్‌టిసి అధికారులు విద్యార్థుల కష్టాలను అర్థం చేసుకొని పాఠశాలకు వచ్చే సమయంలో పాఠశాల నుంచి ఇంటికి పోయే సమయంలో బస్సు నిలిపి విద్యార్థినిలు క్షేమంగా వాళ్ళ ఇంటిని చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేదల ప్రాణాలు కాపాడేందుకే సిఎంఆర్ఎఫ్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పేదల ప్రాణాలు కాపాడడానికి సిఎం సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి సతీమణి ఉమాదేవి తెలిపారు. శనివారం తన నివాసంలో నియోజకవర్గంలో దాదాపు 20 మంది లబ్ధిదారులకు రూ.16,67,281 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థికసాయం అందిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ గోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీని వాసులరెడ్డి, తాళ్లపల్లి వెంకటేశ్వరరెడ్డి, జ్ఞానేశ్వర్ నాయుడు, ముచ్చుమర్రి మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అన్నదమ్ములపై హత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆస్తి గొడవల్లో కక్షలు పెంచుకొని నిద్రిస్తున్న అన్నదమ్ములపై హత్యాయత్నానికి పాల్పడ్డారు ప్రత్యర్థులు. శనివారం తెల్లవారు జామున ములకలచెరువు మండలంలో తీవ్ర కలకలం రేపిన ఘటనకు సంభందించి బాదితులు తెలిపిన వివరాల మేరకు.. బురకాయల కోటకు చెందిన రామచంద్ర, భారతీయుడు, హరికుమార్ అన్నదమ్ములని చెప్పారు. కురబలకోట మండలం ముదివేడుకు చెందిన వీరి బంధువులు భాస్కర్, గంగాద్రి, భవాని ప్రసాద్‌లకు గత కొంతకాలంగా భూ తగాదాలు ఉన్నట్లు తెలిపారు. కోర్టులో హరికుమార్‌కు అనుకూలంగా తీర్పులు వచ్చాయని అన్నారు. తమకు భూమి దక్కదని కక్ష పెంచుకున్న భాస్కర్, గంగాద్రి, భవానిప్రసాద్ మరికొంతమందిని వెంటబెట్టుకుని మారణాయుధాలతో బురకాయలకోటకు వెళ్లారు. ఇంట్లో నిద్రపోతున్న అన్నదమ్ములు రామచంద్ర, భారతీయుడు, హరికుమార్‌లపై కర్రలు, మారణాయుధాలపై మూకుమ్మడిగా దాడి చేసి, హత్య చేసేందుకు ప్రయత్నించారని అన్నారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బాదితులను సమాచారం మేరకు 108 సిబ్బంది షామీర్, మోహన్ మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ములకలచెరువు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిద్రపోతున్న వారిపై మారణాయుధాలతో విచక్షణా రహితంగా దాడి చేసిన భాస్కర్, గంగాద్రి, భవాని ప్రసాద్ లపై కిడ్నాప్, హత్యాయత్నం కేసులు నమోదు చెయ్యాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సిపిఐ నాయకులు కృష్ణప్ప, మురళి లు కలిసి పరామర్శించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

తండ్రి, కుమారుడిపై దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తండ్రి కుమారుడి పై ప్రత్యర్థులు దాడి చేసిన సంఘటన శనివారం మండలంలో జరిగింది. బాధితులు తాలూకా పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు.. పట్టణంలోని కురువంకకు చెందిన శ్రీనివాసులు సమీపంలోని రామిరెడ్డిగారిపల్లె వద్ద స్థానిక రైతుకు చెందిన భూమిని కౌలుకు తీసుకున్నాడు. అందులో రేకుల షెడ్డు నిర్మించుకుని పాడి ఆవులను పెంచుకుంటూ పాల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నాడు. ఇంటర్ చదువుతున్న చింటూ తండ్రితో పొలానికి వెళ్లి పాలు పితికి డైరీకి తీసుకెళ్తుండగా, స్థానికంగా ఉన్న శంకర్ రెడ్డి మరికొందరు వచ్చి మాకు తెలియకుండా ఆవుల షెడ్డు ఎందుకు వేసావని నిలదీసి, గొడవకు దిగారు. వెంటనే షెడ్డును ఖాళీ చేయాలని హెచ్చరించడంతో తిరగబడ్డ తండ్రి కొడుకుపై దాడి చేసి చితకబాదారు. స్థానికులు అడ్డుకుని గాయపడిన బాధితులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు విచారిస్తున్నారు.

ఘర్షణలో రిటైర్డ్ ఉపాధ్యాయుడికి గాయాలు

ప్రజాశక్తి-కలకడ

ఘర్షణలో విశ్రాంత ఉపాధ్యాయుడిని గాయపరిచిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది.మండలంలోని ఎర్రకోట పల్లి పంచాయతీ గొల్లపల్లికి చెందిన కుర్ర సుధాకర ఉపాధ్యాయుడిగా రిటైర్డ్ తన నివాసంలో ఆవులను ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా ఉన్న వెంకటరమణకు చెందిన ఒక గోవు, సుధాకర్ గోవును గాయపరిచినట్లు తెలిపారు. సుధాకర్ తన ఆవును గాయపరిచినందుకు వెంకటరమణను అడగ గా, వెంకటరమణ కుమారులు, ఆనంద, మునిగేంద్రులు కలిసి రాళ్లతో దాడి చేసి గాయపడిచారని తెలిపారు. సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాయపరచిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.